# సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం ; 27 ; నవంబర్ ; 2024




## ప్రభుత్వం మాది.. పెత్తనం మాది

ద్వారకాతిరుమల మండలం సత్తాల గ్రామంలోని పెద్ద చెరువులో ఒక టీడీపీ నేత రాత్రి, పగలు అనే తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించేస్తున్నాడు. 8లో ▸



## ప్రకృతి వ్యవసాయమే రక్ష

ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష అని ఉద్యాన, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. ఉద్యాన వర్సిటీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 8లో ▸



## గంజాయి వయా కుక్కునూరు

గంజాయి స్మగర్లకు కుక్కునూరు రహదారి రాజమార్గంగా తయారైంది. చింతూరు, ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. 8లో ▸

### న్యూస్‌రీల్

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కలెక్టరేట్‌లో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, తదితరులు కలెక్టరేట్ ప్రాంగణంలోని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. అనంతరం వశిష్ఠ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పిస్తూ జాతి, కుల, మత భేదాలు లేకుండా అందరూ ఎదగడానికి అవకాశం కల్పించిందన్నారు. ప్రపంచంలోని ఉన్నతమైన వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మంచిని గ్రహించి మనకు అత్యున్నత రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను తెలుసుకొని ప్రజలకు మంచి సేవలందించి న్యాయం చేయాలన్నారు.

## అర్హత ఉంటే ఎస్సైగా పదోన్నతి



నేర స్థలంలో సమాచార సేకరణపై పరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

పెదవేగి: ఏలూరు రేంజ్ పరిధిలోని హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సైలకు వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి అర్హత కలిగినవారికి ఎస్సైలుగా పదోన్నతులు కల్పిస్తున్నట్లు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్/ఏఎస్సైలు ఫిట్ ఫర్ ఎస్సై పదోన్నతుల కొరకు ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్ క్వాలిఫైయింగ్ పరీక్షలను పెదవేగి డిస్ట్రిక్ ట్రైనింగ్ సెంటర్‌లో ఐజీ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రేంజ్ నుంచి 115 మంది అభ్యర్థులకు క్వాలిఫైయింగ్ పరీక్షలు నిర్వహించారని, క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఆరు వారాల పాటు ట్రైనింగ్ నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో 4వ బెటాలియన్ కమాండెంట్ సి.వి.ఎ రామకృష్ణ , జిల్లా అదనపు ఎస్పీ సూర్య చంద్ర రావు, పెదవేగి డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## భగవంతుడి సంకల్పం, అనుగ్రహం ఉండాలి

శ్రీ విదుశేఖర భారతీ స్వామి



ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న విదుశేఖర భారతీ మహాస్వామి

పాలకొల్లు సెంట్రల్: మనం ఏ కార్యక్రమం తలపెట్టినా అది పూర్తి కావాలంటే భగవంతుడి సంకల్పం, అనుగ్రహం ఉండాలని శృంగేరీ శారదా పీఠాధిపతి శ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి అన్నారు. మంగళవారం విజయ యాత్ర మహోత్సవ ఆహ్వానంలో భాగంగా పాలకొల్లు శ్రీ శృంగేరీ శంకర మఠం శ్రీ శంభేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శంకరాచార్యులు చెప్పిన భజగోవిందం స్తోత్రాన్ని చదివితే జీవితానికి అవసరమైన అర్థం తెలుస్తుందన్నారు. కొందరు అవసరమైన విషయాలకన్నా అనవసరమైన విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారని ఆ సమయాన్ని ఆధ్యాత్మిక ఆరాధన కోసం ఉపయోగిస్తే భగవత్సంకల్పం కలుగుతుందన్నారు. శంభేశ్వరస్వామి ఆలయంలో శివ కేశవుల సాహిత్యం పుష్కలంగా ఉండడంతో పూర్వీకులు ఆరాధిస్తూ వచ్చారన్నారు. ఎన్ని పనులు ఉన్నా భగవంతుడికి కొంత సమయం కేటాయించాలన్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయ అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణకు అనుగుణంగా జగద్గురు భారతీతీర్థ మహాస్వామి అనుగ్రహం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ వ్యవస్థాపకుడు కలగ గుణేశ్వరరావు కుటుంబ సభ్యులు స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# హామీల అమలు ఎప్పుడు?

- ఆందోళనలతో దద్దరిల్లుతున్న కలెక్టరేట్లు
- రోడ్డెక్కిన చిరుద్యోగులు
- ఆందోళన బాటలో ఆశ, 108, హమాలీ, అంగన్‌వాడీ, వీఓఏలు




ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేస్తున్న ప్రభుత్వ స్కీం వర్కర్లు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు కాకుండానే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా చిరుద్యోగులు, కూలీలు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. నిత్యం వివిధ వర్గాలు, చిరుద్యోగులు కలెక్టరేట్ల నిరసన గళం వినిపిస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ ఆశ వర్కర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు, 108 సిబ్బంది, వీవోఏలు, మెప్మా ఆర్పీలు, వివిధ స్కీం వర్కర్లు పోరు బాట పట్టారు.

**నట్టేట ముంచారు: వలంటీర్లు**

ఎన్నికల ముందు ఉత్తుత్తి హామీలు ఇచ్చి నట్టేట ముంచారంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకునే పరిస్థితి లేదంటూ చెప్పడమే కాకుండా దీనికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమంటూ తప్పించుకునే వాదనను తెరమీదకు తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ గ్రామ,వార్డు సచివాలయ వలంటీర్లు ఆందోళన బాటపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హామీ ఇచ్చిన విధంగా రూ.10 వేల జీతం ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయాలు 938, వార్డు సచివాలయాలు 227 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 20,482 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.

**తొలగించిన వీఓఏ, ఆర్పీల్ని విధుల్లోకి తీసుకోవాలి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీఓఏలు, ఆర్పీల పట్ల రాజకీయ వేధింపులు ఎక్కువైపోయాయి. తమకు నచ్చిన వారిని పెట్టుకుంటాం రాజీనామా చేయండి అంటూ స్థానిక కూటమి నేతు హుకుం జారీ చేస్తున్నారు. అక్రమంగా విధుల్లోంచి తొలగించిన వీఓఏలు, ఆర్పీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వెలుగు వీవోఏ(యానిమేటర్స్) ఉద్యోగులు ఇటీవల కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లాలో 100 మంది వరకు వీఓఏలు, 20 మంది ఆర్పీలు విధులకు దూరమయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 50 మందికి పైగా వీఓఏలు, 10 మంది వరకు ఆర్పీలు విధులకు దూరమయ్యారు.

**రోడ్డెక్కిన హమాలీలు**

పౌరసరఫరాల శాఖ పరిధిలోని గోడౌన్స్‌లో పనిచేస్తున్న హమాలీలు తమ వేతనాలు పెంచాలని కోరుతూ రోడ్డెక్కారు. వీరికి ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందాలు జరుగుతాయి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వేతనాల పెంపును పట్టించుకోలేదు. ఏలూరు జిల్లా పరిధిలోని ఏలూరు, కైకలూరు, పాతూరు, నూజివీడు, ధర్మాజీగూడెం, కుకునూరు, కేఆర్ పురం, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని స్టాక్ పాయింట్ల వద్ద హమాలీలు ఇటీవల నిరసన వ్యక్తం చేశారు.

### హామీలు నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నిక లకు ముందు వివిధ వర్గాల ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణం నిలుపుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే వలంటీర్లు, అంగన్‌వాడీ మినీ వర్కర్లు, ఆశలు, స్కీం వర్కర్లు వంటి చిరు ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

– డీఎన్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ, జిల్లా కార్యదర్శి, ఏలూరు

### స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి



చిరు ఉద్యోగులతో పాటు రైతులు, శ్రామికులు, కర్షకులను ఇబ్బందులకు గురిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం బాధాకరం. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, ట్రూ అప్ చార్జీల పేరిట రూ.వేల కోట్ల భారం మోపే విధానానికి స్వస్తి పలకాలి. వీఓఏలు, ఆర్పీలు, వివిధ ప్రభుత్వ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ,

### 108 ఉద్యోగుల సమ్మె బాట



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న 108 ఉద్యోగులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. 108 అంబులెన్స్ సర్వీసులు నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, షిఫ్టుల సిస్టం అమలు చేయాలని, రెండు నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 108 వాహనాలు 28 ఉండగా వీటిలో మొత్తం 140 మంది పైలట్‌లు, ఈఎంటీలు పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 108 వాహనాలు 23 ఉండగా వీటి పరిధిలో 110 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

### మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ మినీ వర్కర్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 276 మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ తక్షణం జీవోలు ఇవ్వాలంటూ మినీ అంగన్‌వాడీ వర్కర్‌లు ఆందోళన చేస్తున్నారు. కేవలం రూ.7 వేలు వేతనం ఇస్తున్నారని ఇది అత్యంత దుర్మార్గమంటూ వారు విమర్శిస్తున్నారు. మెయిన్ సెంటర్‌లో పనిచేస్తే కార్యకర్తకు ఇస్తున్న విధంగా తమకూ వేతనం ఇవ్వాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 206, పశ్చిమగోదావరి జిల్లాలో 70 మంది కలిపి రెండు జిల్లాల్లో మొత్తం 276 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారు.

### ఒప్పందాలు అమలు చేయాలి



ఏలూరులో ధర్నా చేస్తున్న ఆశలు

2024 ఫిబ్రవరిలో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలంటూ ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. ఆశ వర్కర్ల వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గ్రూప్ బీమా ఆరు లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60 వేలు ఇస్తామంటూ ఒప్పందం చేసుకున్నారని దీనికి సంబంధించి తక్షణం జీవోలు విడుదల చేయాలంటూ వీరు ధర్నా నిర్వహిస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మొత్తం 3,800 మంది వరకు ఆశలు పనిచేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఇప్పటికే ఏలూరు, భీమవరం కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించారు .

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన




భీమవరంలో ధర్నా చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల నాయకులు

భీమవరం: రైతులకు గిట్టుబాటు ధరను గ్యారెంటీ చేస్తూ చట్టం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ వాగ్దానాన్ని నిలబెట్టుకోకుండా, నల్ల చట్టాలను దొడ్డి దారిన అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ భీమవరంలో సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. భీమవరం సీఐటీయు కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ అధ్యక్షత వహించగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు పి.జమలయ్యలు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని దుయ్యబట్టారు. పెద్ద మొత్తంలో కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు రుణమాఫీ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి అభివృద్ధి చేయడానికి బదులు అమ్మడానికి కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. కౌలు రైతు సంఘం నాయకుడు మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బాతిరెడ్డి జార్జి, శ్రామిక మహిళా నాయకురాలు డి.కళ్యాణి మాట్లాడుతూ కేంద్రం విధానాలను గుడ్డిగా సమర్థిస్తూ రాష్ట్రం కూడా ప్రజలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, కర్రా నాగేశ్వరరావు, కె.లక్ష్మణరావు, ఆనంద్, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, కె.జాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఏలూరు(మెట్రో): ఎన్నికల సక్రమ నిర్వహణకు శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు చెప్పారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరుగుతాయన్నారు. సిబ్బందికి ఏమైనా సందేహాలుంటే వెంటనే శిక్షకుల దృష్టికి తీసుకువస్తే వెంటనే నివృత్తి చేస్తారన్నారు. సమావేశంలో ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో అనాథ శవాల మాయంపై విచారణ

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ బోధనాసుపత్రి మార్చురీలోని అనాథ శవాల మాయం వ్యవహారంపై రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విజయవాడ డీఎంఈ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అనాథ శవాలను ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు అధిక రేటుకు విక్రయించిన వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజుతో పాటు పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరరావు, మార్చురీ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ప్రభుచంద్ తదితరులు ఈ విచారణకు హాజరయ్యారు. మార్చురీలోని రికార్డులతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీపై ఆరా తీశారు. రికార్డులకు సంబంధించి అనాథ శవాల మాయంలో కొన్ని కాగితాలు తొలగించినట్లు తెలుస్తుంది. ఈ ఘటనలో ఇప్పటికే ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని సస్పెండ్ చేయగా అధికారుల పాత్రపై ఆరా తీస్తున్నారు. ఈ విచారణను అత్యంత గోప్యంగా ఉంచడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఫోరెన్సిక్ విభాగాధిపతి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ కోణంలో కూడా దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నిలిచిన గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం రూరల్: నిత్యం కంకర తవ్వకాలు, లారీల రాకపోకలతో అల్లాడిపోయే తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో మంగళవారం నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ×నిబంధనలు కాలరాసి... కంకర తవ్వేసి× శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తతో మైనింగ్ మాఫియా సైలెంట్ అయిపోయింది. అధికారులు దాడులు లేకుండానే మాఫియా తమ జేసీబీలు, లారీలను గ్రామంలో లేకుండా తరలించారు. మరికొన్నింటిని తమ పార్కింగ్ ప్రాంతాల్లో వదిలేశారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తవ్వకాలు జరిపిన మైనింగ్ మాఫియా ప్రస్తుతం మిన్నకుంది. రాత్రి సమయాల్లో మాత్రం యథేచ్ఛగా అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. జాతీయ రహదారి మీదుగా తాడేపల్లిగూడెం పట్టణంలోకి మంగళవారం సైతం కంకర లారీలు రాకపోకలు సాగించాయి.



ఆరుగొలనులో తవ్వకాలు నిలిచిపోయిన దృశ్యం

## చెత్త తొలగింపు

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'తణుకులో మినీ చెత్త డంపింగ్ యార్డులు' శీర్షికన ఈనెల 24న సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. తణుకు 13 నెంబరు మున్సిపల్ పాఠశాల ఎదురుగా, సోమంచి వారి వీధిలో రోడ్డుకు రెండు వైపుల ఉన్న చెత్తను జేసీబీ సాయంతో తొలగించడంతో పాటు ముత్యాల వారి వీధిలో ప్రైవేటు ఖాళీస్థలం, బాబు వారివీధిలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న కొబ్బరి బొండాలు, చెత్తను తొలగించారు.



తణుకు బాబు వారి వీధిలో కొబ్బరి బొండాలు, చెత్త తొలగించిన దృశ్యం





అంధుల పరుగు పోటీల్లో పరుగులు తీస్తూ

## ఆత్మస్థైర్యం మెండుగా..

సంకల్పంతో కూడిన ఆత్మస్థైర్యం ఉంటే చాలు ఏ వైకల్యం మనకు అడ్డురాదని నిరూపించారు విభిన్న ప్రతిభావంతులు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున దివ్యాంగులు హాజరై తమ ప్రతిభను చూపారు. ట్రై సైకిల్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలవాలనే కాంక్షతో పరుగులు పెట్టారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, ఏలూరు(టూటౌన్)



గెలవాలనే కసితో..



జావెలిన్ త్రో

## క్లుప్తంగా

### విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

భీమవరం: తన విధులకు ఆటంకం కలిగించారంటూ పంచాయతీ కార్యదర్శి చేసిన ఫిర్యాదు మేరకు ఒక వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భీమవరం వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. నర్సింహపురం గ్రామానికి చెందిన పెన్మెత్స కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదుపై ఈనెల 23వ తేదీన భీమవరం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఈ విచారణకు ఫిర్యాదుదారు కృష్ణంరాజుతోపాటు పంచాయతీ కార్యదర్శి ములపర్తి సాయిబాబు హాజరయ్యారు. విచారణలో ఎంపీడీవో ఆదేశాల మేరకు ఇద్దరు తమ ఫోన్లను టేబుల్‌పై పెట్టారు. ఇంతలో వెంటనే కృష్ణంరాజు దౌర్జన్యంగా తన ఫోన్ లాక్కొని అందులోని డేటాను ఇతరులకు పంపించి తన విధులకు ఆటంకం కలిగించాడని పంచాయతీ కార్యదర్శి సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ చెప్పారు.

### అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం.. హేయమైన చర్య

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమని సమతాసైనిక్ దళ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, దళిత బహుజన సీనియర్ నాయకుడు నేతల రమేష్ బాబు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరుపుకుంటున్న వేళ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### పోలీసుల అదుపులో దొంగల ముఠా?

భీమవరం: భీమవరంలోని ఒక వ్యాపారి ఇంట్లో దొంగతనానికి వచ్చిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టూటౌన్ ప్రాంతంలో పెద్దెత్తున వ్యాపారం చేస్తున్న ఒక వ్యక్తిని టార్గెట్‌గా చేసుకుని రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలకు చెందిన సుమారు 12 మంది ముఠా సభ్యులు కార్లలో మారణాయుధాలతో దోపిడి చేయడానికి వచ్చారు. అయితే ఇంటి గోడలు దూకుతుండగా ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో భీమవరం పట్టణంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### బాలికపై అత్యాచారయత్నం

దెందులూరు: బాలికపై ఓ మైనర్ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలివి. మసీదుపాడు గ్రామంలో బాలిక (4)పై అదే గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలుడు తన ఇంట్లో అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై శివాజీ చెప్పారు. నూజివీడు డీఎస్పీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

### చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

దెందులూరు: చెక్కు బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి కోర్టు ఆరునెలల జైలు శిక్ష విధించింది. గోటి మోహనరావు కొవ్వలి గ్రామంలో 13 ఎకరాల వక్ఫ్‌భూమి లీజుకు తీసుకున్నాడు. కౌలు సొమ్ముల నిమిత్తం ముస్లిం వంశపారపర్య ధర్మకర్త ముతావల్లి అబ్దుల్ రహీంకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును ముతావల్లి బ్యాంకులో వేయగా అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో మోహనరావుపై కోర్టులో ఫిర్యాదు చేయగా కేసు విచారణ అనంతరం నిందితుడికి మంగళవారం భీమడోలు కోర్టు న్యాయమూర్తి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు.

## మద్దిక్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో కిటకిటలాడిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చక్రదేవరపల్లి గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ రూపాల్లో స్వామివారికి రూ.7,30,906 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. – జంగారెడ్డిగూడెం రూరల్

## రాజ్యాంగం పట్ల విధేయత




బయ్యనగూడెంలో విద్యార్థుల ప్రదర్శన

రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశ పురోగతి, ప్రజల సంక్షేమాలకు తోడ్పాటు నందించే భారత రాజ్యాంగానికి ఆమోదం లభించి 75 వసంతాలు పూర్తిచేసుకుంది. ఈనేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి అర్పించారు. రాజ్యాంగ పీఠికను పాఠశాలల్లో విద్యార్థులతో చదివించారు. బయ్యనగూడెంలో సరిపల్లి రోడ్‌లో ఉన్న ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో ప్రదర్శన నిర్వహించి రాజ్యాంగం పట్ల తమ విధేయతను చాటుకున్నారు. – కొయ్యలగూడెం

## సంక్రాంతి సమరానికి సై



కైకలూరు టౌన్‌హాలులో నెల్లూరుకు చెందిన రైతుల కోడిపుంజుల విక్రయాలు

సంక్రాంతి సమరానికి కోడి పుంజులు సై అంటూ సిద్ధమవుతున్నాయి. ఈనేపథ్యంలోనే పందెపు పుంజుల విక్రయాలు సైతం జోరందుకున్నాయి. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి సమీప కైకలూరు టౌన్‌హాల్‌లో నెల్లూరు రైతులు వివిధ జాతుల పందెపు కోడి పుంజలను మంగళవారం విక్రయాలకు ఉంచారు. ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కోడి పందేల నిర్వాహకులు పెద్ద ఎత్తున వచ్చి నచ్చిన పుంజును కొనుగోలు చేశారు. పలు జాతుల పందెపు కోడిపుంజులు ఒక్కొక్కటి రూ.7 వేల నుంచి రూ.10 వేలు వరకు పలికాయి. – కైకలూరు

# ప్రభుత్వం మాది.. పెత్తనం మాది

- సత్తాల చెరువులో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
- ఇదేంటని ప్రశ్నిస్తున్న వారిపై టీడీపీ నేత దౌర్జన్యాలు



ద్వారకాతిరుమల మండలం సత్తాల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల: ప్రభుత్వం మాది.. పెత్తనం మాది.. ఎవడ్రా మమ్మల్ని ఆపేది అంటూ ఒక టీడీపీ నేత చెరువు మట్టిని కొల్లగొట్టేస్తున్నాడు. యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నాడు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి తెగబడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సత్తాల గ్రామంలోని పెద్ద చెరువులో ఒక టీడీపీ నాయకుడు గత కొద్దిరోజులుగా జేసీబీ సహాయంతో అక్రమ మట్టి తవ్వకాలను జరుపుతున్నాడు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించేస్తున్నాడు. నిత్యం 50కు పైగా టిప్పర్ల మట్టి కొల్లేరు ప్రాంతానికి తరలిపోతోంది. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. అక్రమ మట్టి తరలింపుపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆ నేత దౌర్జన్యానికి పాల్పడుతున్నాడట. స్థానికులపైనే కాదు.. మట్టి రవాణా కారణంగా తమ రోడ్లు పాడవుతున్నాయని అడుగుతున్న కైకరం, కోండ్రుపాడు గ్రామాలకు చెందిన వారిపైనా ఆ నేత రుబాబు చేస్తున్నాడట. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పచ్చ నేతల మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సతీష్ వివరణ ఇస్తూ సత్తాల చెరువులో అనధికారికంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను సోమవారం రాత్రి తాను నిలుపుదల చేసినట్టు చెప్పారు.

## నేషనల్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా నిస్సీఫ్లోరా



నిస్సీఫ్లోరా

ఉండి: నేషనల్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉండి పెదపేటకు చెందిన గోడి నిస్సీఫ్లోరా నియమితులయ్యారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో డిసెంబర్ 2న ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. నిస్సీఫ్లోరా తండ్రి ఏసురత్నం రిటైర్డ్ టీచర్ కాగా, తల్లి వర్జీనియా గవర్నమెంట్ స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 16 డైరెక్టర్ పోస్టులకుగాను 16 వేల మంది ప్రిలిమ్స్ పరీక్ష రాశారు. అందులో 251 మంది మెయిన్స్‌కు ఎంపిక కాగా 65 మంది ఇంటర్వ్యూకు పోటీ పడ్డారు. ఈ పరీక్షల్లో నిస్సీఫ్లోరా ప్రతిభ కనబరిచి డైరెక్టర్ పోస్టుకు అర్హత సంపాదించారు. మంగళవారం ఆమె తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నేషనల్ హార్టీకల్చర్ బోర్డు 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంతో 2024 జనవరిలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అనంతరం ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, మార్చిలో మెయిన్స్ పరీక్షలు రాశానని, ఏప్రిల్‌లో ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. అక్టోబర్‌లో ఫైనల్ రిజల్ట్ వెలువడగా ఈనెల 18వ తేదీన అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చినట్లు ఆమె తెలిపారు. తాను ఇంతటి ఉన్నతస్థాయికి చేరడానికి కారణం తాతయ్య చిట్టూరి సుందరరావు, తల్లిదండ్రులే ప్రోత్సాహమేనన్నారు. కేవీకే హోం సైన్సు శాస్త్రవేత్త డాక్టర్ దెబోరా మెస్సియానా తదితరులు నిస్సీఫ్లోరాకు శుభాంకాక్షలు తెలిపారు.

# వరి కోతలు వాయిదా వేసుకోండి

రైతులకు సూచించిన జేసీ



చిలుకూరులో ధాన్యం తూకాలను పరిశీలిస్తున్న జేసీ

ఉండి: అల్పపీడన ప్రభావం కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టీ రాహుల్‌కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఉండి మండలం చిలుకూరులో కళ్లాలపై తూకం వేస్తున్న ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేని కారణంగా ఇప్పటికే వరి కోతలు కోసిన వారు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చిలుకూరులో ధాన్యం తూకం వేసే సమయంలో 40.6 కేజీలు ఉండాల్సిన బస్తా 400 గ్రాములు అధికంగా తూకం వేయడంతో రైతులను వివరాలు అడిగారు. చినిగిన గోనె సంచుల వల్ల ఇబ్బందులు ఉంటాయని రైతులు చెప్పడంతో డీసీఎం సొసైటీ అధికారులతో మాట్లాడి గోనె సంచులకు ప్యాచ్ వర్క్స్ చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి బీ సంధ్య, వీఆర్వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

# గల్ఫ్ పంపిస్తానని మోసం.. కేసు నమోదు

భీమవరం: ప్లంబింగ్ పనికి గల్ఫ్ పంపిస్తానని చెప్పి సొమ్ము తీసుకుని మలేషియా పంపించి మోసం చేశారంటూ భీమవరం పట్టణం మోటుపల్లివారివీధికి చెందిన కోడె నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. నాగరాజు ఉపాధికోసం గల్ఫ్ వెళ్లే ప్రయత్నంలో ఉండగా ప్రకాష్‌నగర్‌కు చెందిన రేవు రామలక్ష్మి ప్లంబింగ్ పనులకు గల్ఫ్ పంపిస్తానని నమ్మించి రూ.1.50 లక్షలు తీసుకుంది. అయితే నాగరాజును మలేషియా పంపించి హోటల్ పనిలో పెట్టడంతో అక్కడ జీతం ఇవ్వకుండా మానసికంగా వేధించారు. దీనితో నాగరాజు భార్య రామలక్ష్మిని కలిసి తన భర్తను తిరిగి రప్పించాలని కోరినా పట్టించుకోలేదు. సొంత డబ్బులతో తిరిగి వచ్చిన నాగరాజు ఖర్చు విషయంపై రామలక్ష్మిని అడిగితే నీ అంతచూస్తానని బెదిరించారు. బాధితుడు నాగరాజు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ చెప్పారు.

# ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష



ఉద్యాన వర్సిటీలో మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

తాడేపల్లిగూడెం: ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష అని వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సెరీ కల్చర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతుల ఆదాయం పెంచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో క్రియాశీలకంగా ఉంటుందన్నారు. శాస్త్రీయ సంస్థలు, ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ జీరో బడ్జెట్ వ్యవసాయంగా 2016లో ప్రకృతి వ్యవసాయాన్ని గుర్తించారన్నారు. ఇప్పుడు అది ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫార్మింగ్‌గా మారిందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో మట్టి నాణ్యత, నీటి వినియోగం, శ్రామిక ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధిస్తారని రిటైర్డ్ ఐఏఎస్, ఆర్‌వైఎస్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, పరిశోధన సంచాలకులు కేఎస్.వరప్రసాద్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విద్యను పాఠ్యాంశాల్లో చేర్చడం వల్ల కలిగిన ప్రయోజనాల గురించి డీవీ రాయుడు (రిటైర్డ్ ఐఏఎస్) వివరించారు. ప్రగతిశీల రైతులను ఈ సందర్భంగా సత్కరించారు. డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్, ఎం.మాధవి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

## చింతూరు టు ఖమ్మం వయా కుక్కునూరు

గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్న స్మగ్లర్లు



గంజాయి తరలిస్తున్న నిందితులతో తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు

కుక్కునూరు: గంజాయి అక్రమ రవాణా సాగించే స్మగర్లకు కుక్కునూరు రహదారి రాజమార్గంగా తయారైంది. దీంతో చింతూరు, ఒరిస్సా, చత్తీస్ఘడ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయిని కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. సోమవారం కుక్కునూరు నుంచి అశ్వారావుపేట మీదుగా 10 కేజీల గంజాయిని ఖమ్మం తరలిస్తుండగా, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలో పట్టుకున్నారు. వారిని విచారించగా, బూర్గుంపాడు నుంచి కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నట్లు నిందితులు చెప్పినట్లుగా సమాచారం. గత ప్రభుత్వంలో అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెక్‌పోస్టు వద్ద భద్రతను ఏర్పాటు చేయకపోవడంతో దూరమైనా కుక్కునూరు మీదుగా అక్రమార్కులు తరలిస్తున్నారు. దీనికి తోడు ఈ రహదారి వెంబడి ఎటువంటి తనిఖీలు లేకపోవడం కూడా స్మగర్లు ఈ దారిని ఎంచుకోవడానికి కారణమైంది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై తెలంగాణ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌ను ఫోన్‌లో సంప్రదించగా, నిందితులు గంజాయిని బైక్‌పై కుక్కునూరు మీదుగా తీసుకువచ్చినట్లు చెప్పారని వెల్లడించారు.

## క్లుప్తంగా

### బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

**అత్తిలి:** బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ రహిత రాష్ట్రం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు అనేది ఒక సాంఘిక దురాచారమన్నారు. బాల్యవివాహాలు విద్యకు, ఆరోగ్యానికి, అభివృద్ధికి ఆటంకమన్నారు. గృహహింస, బాల్యవివాహాల నిషేధచట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారిణి వై సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరంలో 93 మందికి వైద్య పరీక్షలు

**తణుకు టౌన్:** మండలంలోని తేతలి గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీర తాత ఆధ్వర్యంలో తణుకు పట్టణానికి చెందిన కోనా ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 93 మంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వీరతాత తెలిపారు. మంగళవారం సాయంత్రం తేతలి గ్రామంలో నిర్వహించిన ఈవైద్య శిబిరంలో బీపీ, సుగర్, మెదడు, నరాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో నలుగురికి పరీక్షల నిమిత్తం ఎమ్మారై స్కానింగ్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె సునీల్‌కుమార్, ఆసుపత్రి సిబ్బందితో పాటు మండల పీఎంపీ అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**తణుకు టౌన్:** గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర లయోలా కళాశాల అధ్యాపకులు డాక్టర్ జీపీ ప్రసాదరావు, ఏపీ ఎస్‌సీహెచ్ అకడమిక్ ఆఫీసర్ రంగం మాథ్యూలు తెలిపారు. మంగళవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన స్వయం ప్రతిపత్తి గల కళాశాలల సౌందర్యం అనే అంశంపై నిర్వహించిన సదస్సు నిర్వహించారు. డాక్టర్ జీపీ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రంథాలయ వ్యవస్థ, విద్యార్థులకు, సమాజ వికాసానికి దోహదం చేస్తుందన్నారు. ఈసందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**పెంటపాడు:** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అవకతవకలను కూటమి ప్రభుత్వం తక్షణం అరికట్టాలని ఏపీ కౌలురైతు సంఘ ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కౌలు రైతుసంఘ బృందం గణపవరం, పెంటపాడు మండలాలలో పర్యటించింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గోనె సంచులు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, యజ్జల పండు, రైతుసంఘం నాయకులు వంకా రామకృష్ణ, వంకా అప్పారావు, జాలపర్తి నాగేశ్వరరావు, కొణతాల నాగరాజు పాల్గొన్నారు.

### సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్రహ్మణ్యం

**తాడేపల్లిగూడెం:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యాశ, అవగాహనలేమి, వల్ల సైబర్ నేరగాళ్ల వలలో కొందరు పడుతున్నారన్నారు. సైబర్ మోసానికి గురైన ఒక గంట వ్యవధిలో 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటీ నిపుణులు దామరాజు సాయి సతీష్ సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం.రమేష్ నాయుడు,చీఫ్ మేనేజర్ సురేష్, మేనేజర్ దశిక శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పద్మవ్యూహం

- విస్తరణకు నోచుకోని రోడ్లు
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- నిత్యం ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు సతమతం
- ఫుట్‌పాత్‌లు లేక ప్రాణాలు కోల్పోతున్న పాదచారులు
- రోజురోజుకీ పెరుగుతున్న వాహనాలు



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ట్రాఫిక్ దుస్థితి



వేల్పూరు రోడ్డులో నిలిచి పోయిన ట్రాఫిక్



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రోడ్డుపైనే నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

**తణుకు అర్బన్ :** ట్రాఫిక్.. ట్రాఫిక్.. ట్రాఫిక్.. తణుకులో ఏనోట విన్నా ఇదే సమస్య... ఉద్యోగ, వ్యాపారం, ఇతర అవసరాలతో తణుకు రహదారుల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ ఈ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొని అల్లాడుతున్నారు. వ్యాపార వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తణుకు పట్టణం గతం కంటే విస్తీర్ణం పెరిగింది. అంతేకాకుండా ఇటీవల కాలంలో గ్రామాల నుంచి వలస వస్తున్న ప్రజలు పట్టణ ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకుని స్థిరపడుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ జనాభా విపరీతంగా పెరిగింది. జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరగడంతో రహదారులు ప్రయాణికుల రాకపోకలతో తణుకు ప్రధాన రహదారులు విపరీతమైన ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోతున్నాయి. దీంతో వివిధ పనులపై రహదారుల్లోకి వచ్చిన వారికి తణుకు ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ చుక్కలు చూపిస్తుంది. వృద్ధులు రోడ్డు దాటి అవతలివైపునకు వెళ్లాలంటే నగరాల్లో మాదిరిగా వేచిచూడాల్సిన దుస్థితి కలిగింది. అంతేకాకుండా రాష్ట్రపతి రోడ్డులోని ఆర్వోబీ నుంచి కేశవస్వామి ఆలయం వరకు ప్రయాణం చేయాలంటే ట్రాఫిక్‌లో ఇరుక్కుని చిక్కులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులోని పాత పోస్టాఫీసు సెంటర్ నుంచి నరేంద్ర సెంటర్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడంతో వాహనాలు తమ ఇష్టానుసారంగా రాంగ్ రూట్‌లో సైతం ప్రయాణిస్తున్నామని తణుకువాసులు ఆరోపిస్తున్నారు.

**రోడ్డుపైనే నిలుస్తున్న ఆటోలు, ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు**

ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులో ప్రయాణించే ఆటోలతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆటోలను ఇష్టానుసారంగా రోడ్డుపైనే నిలిపివేయడంతో క్షణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే పరిస్థితి దాపురించింది. వీటికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా రోడ్డుపైనే నిలిపివేసి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో బస్సుల వెనుక వాహనాలు నిలిచిపోయే దుస్థితి ఎదురవుతోంది. ఇక ప్రైవేటు కార్లు దుకాణాల ముందు వారి షాపింగ్ పూర్తయ్యే వరకు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. వీటిపై ట్రాఫిక్ పోలీసులు నెత్తీనోరు బాదుకుంటున్నా వారు తాపీగా తమ పని ముగిస్తేనే కానీ వాహనాలు ముందుకు కదలని పరిస్థితి.

**20 వేలకుపైగా వాహనాలు...**

తణుకు రాష్ట్రపతి రోడ్డులో ఆటోలు, ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులు కలిపి మొత్తం రోజుకు సుమారుగా 20 వేలకుపైగా ప్రయాణాలు చేస్తున్నాయి. వీటిలో కొన్ని వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్‌లు చేస్తుండడంతో అవి కదిలేలోపే ట్రాఫిక్ జామ్ అయ్యే దుస్థితిని ప్రయాణికులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, సొసైటీ రోడ్డు, స్త్రీ సమాజం రోడ్డులో ట్రాఫిక్ తీవ్రరూపం దాలుస్తుంది. పెరవలి, వేల్పూరు, తేతలి, చివటం ప్రాంతాల నుంచి తణుకు పట్టణంలోకి వస్తున్న ప్రయాణికులు ఈ రహదారుల మీదుగానే పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. ఈ ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న సూర్యాలయం వీధి, బాబు వారి వీధి, తంగిరాల వారి వీధుల్లో రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌లు చేసుకోవడంతో పాటు మరమ్మతులు కూడా రోడ్డుపైనే చేస్తున్న కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధుల్లో ప్రైవేటు ఆస్పత్రులు అధికంగా ఉండడంతో ఆస్పత్రులకు వెళ్లే రోగులు సైతం నానా యాతన పడుతున్నామని చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు ట్రాఫిక్ సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ట్రాఫిక్ సమస్య రాకుండా చూస్తున్నాం**



తణుకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమిస్తున్నాం. ట్రాఫిక్ విభాగంలోని పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ట్రాఫిక్ పాయింట్లను గుర్తించి అక్కడ తప్పనిసరిగా కానిస్టేబుల్స్ ఉండేలా ఏర్పాట్లు చేశాం. పాయింట్‌ల్లో ఉండే కానిస్టేబుల్స్ కాకుండా బ్లూకోట్స్ టీం కూడా ప్రత్యేక వాహనంపై ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు. నిబంధనలు మీరి ఇష్టానుసారంగా పార్కింగ్ చేసే వాహనాలపై ప్రత్యేక యాప్ ద్వారా ఫైన్‌లు వేస్తున్నాం. సూర్యాలయం వీధి, తంగిరాల వారి వీధి, బాబు వారి వీధుల్లో దృష్టిపెట్టి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూస్తాం. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణాలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నిబంధనలతో పాటు రోడ్డు ప్రమాదాలపై కూడా వాహనదారులు, ఆటోడ్రైవర్లకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.కొండయ్య, తణుకు పట్టణ సీఐ

# రాజ్యాంగం అత్యంత పవిత్ర గ్రంథం



తాడేపల్లిగూడెం రూరల్: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ సునీల్‌కుమార్



ఇరగవరం: అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో



తణుకు అర్బన్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సురేష్ తదితరులు



తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



పెంటపాడు: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న వక్తలు



తణుకు టౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



అత్తిలి: తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్, గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లులర్పిస్తున్నచీకటిమిల్లి మంగరాజు

**తాడేపల్లిగూడెం రూరల్:** భారతీయులను ఏకతాటిపై నడిపించే పవిత్ర గ్రంథమే రాజ్యాంగమని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వద్ద భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి తహశీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా వివిధ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఆర్ఐ శివప్రసాద్, ఎంఈవో వి.హనుమ, సీఆర్పీ బత్తుల నాని, సిబ్బంది పాల్గొన్నారు.

**రాజ్యాంగాన్ని గౌరవించడం అందరి బాధ్యత**

**ఇరగవరం:** ఎంతో పవిత్రమైన రాజ్యాంగానికి లోబడి నడుచుకోవడం, రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంపై నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**వేడుకగా భారత రాజ్యాంగ దినోత్సవం**

**తణుకు అర్బన్:** యావత్ ప్రపంచం భారతదేశం వైపు చూసేలా రూపొందించిన భారత రాజ్యాంగం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఆమోదింపబడిన రోజు భారతీయులకు పండుగ వాతావరణమని స్పష్టం చేశారు. తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు ఝాన్సీ లారెన్స్, చింతన్న, షేక్ జిలానీ, వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు జి.అంబేడ్కర్, కామర్సు శ్రీనివాస్, సీహెచ్ నాగేశ్వరరావు, పొట్ల సురేష్, పొట్ల విజయ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.సీతామహాలక్ష్మి, శ్రీరామమూర్తి, పెద్దిరాజు, అక్కింసెట్టి రాంబాబు, రాధ, వెంకట్రాజు, కుమారి, సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మహనీయుడు అంబేడ్కర్**

**తాడేపల్లిగూడెం:** అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేడ్కర్ అని ఆయనకు అన్ని వర్గాలు రుణపడి ఉంటాయని మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పలు చోట్ల జరిగిన కార్యక్రమాల్లో వక్తలు పేర్కొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు, మహిళాసమాఖ్య అధ్యక్షురాలు పద్మప్రియ, అధికారులు పాల్గొన్నారు. నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ మాట్లాడారు. రాజ్యాంగంలోని భారతదేశ ప్రజాస్వామ్యం, సమానత్వంల గురించి విద్యార్థులకు వివరించారు.

**ప్రతి పౌరుడికీ సమాన హక్కులు**

**పెంటపాడు:** దేశంలో పుట్టిన ప్రతి పౌరుడికీ కులమతాలకు అతీతంగా రాజ్యాంగం సమానమైన హక్కులు కల్పించిందని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, విజయబాబు, జాన్‌బాబు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. పెంటపాడు బేసిక్‌స్కూల్లో ప్రిన్సిపాల్ ఏవీఎస్వీ ప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి ల అధ్యక్షతన విశ్రాంత బ్యాంక్ మేనేజర్, మానవత జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి హైమావతి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జట్లపాలెం గ్రామంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

**రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి**

**తణుకు టౌన్:** నేటి విద్యార్థులే రేపటి రాజ్యాంగ వ్యవస్థలకు సారథులుగా నిలుస్తారని, వారికి రాజ్యాంగ మౌలిక భావనలు తెలియజేయాలని రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డీవీవీఎస్ వర్మ చెప్పారు. మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ అనిల్ కుమార్, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో గల గ్రామ సచివాలయాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**అత్తిలిలో భారత రాజ్యాంగ దినోత్సవం**

**అత్తిలి:** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు తహసీల్దార్ దశిక వంశీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):**, భారత రాజ్యాంగం రూపకల్పనలో అంబేడ్కర్ ముఖ్యపాత్ర పోషించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. మంగరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. రాజ్యాంగం ప్రజలకు రక్షణ కవచాలుగా రూపొందించారని, గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ప్రేమ్ కుమార్, గెద్దం అచ్చిబాబు, రత్నబాబు, ఏడుకొండలు, ప్రైబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచానికి ఆదర్శం మన రాజ్యాంగం**

**తాడేపల్లిగూడెం:** ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించడంతో పాటు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి కోరారు. ఏపీ నిట్‌లో మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఉన్నత విలువలతో ఉన్న రాజ్యాంగాన్ని రచించి రాజ్యాంగ పితగా గణతికెక్కారన్నారు. డీన్ స్టూడెంట్ అఫైర్సు జీబి.వీరేష్‌కుమార్, ఆచార్యులు వినోత్ కుమార్ రాజా, సౌమ్య జోస్, డీన్ ఎస్.జయరామ్ పాల్గొన్నారు.

## ఎర్ర కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

**తాడేపల్లిగూడెం రూరల్:** ఎర్ర కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో సీపీఎం ఎనిమిదవ మహాసభ నిర్వహించారు. తొలుత సీపీఎం స్థూపాన్ని ఆవిష్కరించి, జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా చింతకాయల బాబూరావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యానికి ప్రతి ఏడాది ఎర్ర కాలవ ముంపునకు రైతులు పంట నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఎర్ర కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కంసాలిపాలెం మధ్యలో ఉన్న బ్రిడ్జిని తక్షణమే నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ వీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల పూర్వ కార్యదర్శి పి.గోవింద్, పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, కండెల్లి సోమరాజు, పాలపూరి సత్యవతి మాటాల్డారు. ప్రజానాట్య మండలి దళం జిల్లా కార్యదర్శి షేక్ వలీ, పోతు శ్రీను, దుర్గా, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, పూరెళ్ల సుబ్బారావు, కండెల్లి విజయ, మడక రాజు, మల్లుల పరమేసు,పెట్ల కృపారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, రైతుల సమస్యలు పరిష్కరించాలి

**తణుకు అర్బన్:** కార్మికవర్గం, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు మోదీ ప్రభుత్వానికి చేతులు రావడంలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విమర్శించారు. మంగళవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో కార్మికులు, కర్షకుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గాలకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలుతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేసి పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి, గారరంగారావు,రాజు పాల్గొన్నారు.

# పరిమెళ్లలో ఉద్రిక్తత



పరిమెళ్ల గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకొన్న దృశ్యం

**పెంటపాడు:** మండలంలోని పరిమెళ్ల గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకొంది. జగనన్న కాలనీకి ఆనుకొని ఆక్రమణ దారులకు చెందిన 30 పూరిళ్లు ఖాళీ చేయాలని అధికారులు గతంలో నోటీసులు జారీ చేశారు. అయితే బోడపాడు కాలువ గట్టుపై రైతులు వెళ్లేందుకు ఈ గుడిసెలు అడ్డుగా ఉన్నాయని అక్కడి రైతులు జిల్లా కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని చెబుతూనే వచ్చారు. మంగళవారం ఉన్నట్టుండి తమ గుడిసెలు తొలగిస్తే ఎక్కడికి వెళతామని బాధితులు గగ్గోలు పెట్టారు. ఎట్టకేలకు ఒక్కరోజు సమయం ఇస్తామని తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ తెలిపారు. ఇరిగేషన్, ఎంపీడీవో, రెవెన్యూ, విద్యుత్ శాఖ, పోలీసు, తదితర శాఖల అధికారులు అక్కడ మోహరించారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకొంది.

## మీనవిల్లూరులో ఎక్సైజ్ అధికారుల దాడులు

**పెంటపాడు:** మండలంలోని మీనవిల్లూరు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని గూడెం ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ కల్యాణ చక్రవర్తి ఆదేశాల మేరకు ఎస్‌ఐలు మురళీమోహన్, దొరబాబులు దాడులు చేశారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొన్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ మురళీ తెలిపారు.

## కుక్క దాడిలో బాలుడికి గాయాలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** మామిడి తోటకు చెందిన ఎం.తూనేష్ నాగ షణ్ముఖ్ (10) మంగళవారం సాయంత్రం స్కూల్ నుంచి వస్తుండగా కుక్క దాడి చేసి కరిచింది. తల్లిదండ్రులు బాలుడిని ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి వ్యాక్సిన్ వేయించారు. మాట్లాడుతూ కుక్కలు వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ దారిన వెళ్లేవారిపై తరచుగా దాడి చేసి కరుస్తున్నాయని, వాహనదారులను వెంబడిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.